GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్®
THE
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
బుధవారం 25-11-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు..



రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం!

- 115/1 సర్వే నంబర్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయంటూ స్థానికుల ఆరోపణలు
- ఫిర్యాడులు చేసినా స్పందన లేదని ఆవేదన
- ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని డిమాండ్

24 గండిపేట్ 08

2

గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంది. కానీ మ్రైలార్‌డేవేపల్లి డివిజన్ పరిధిలోని ఊరగుట్ట ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నాయనే ఆరోపణలు అధికారుల పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయ. సర్వే నంబర్ 115/1లోని ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపస్తున్నారు. ప్రభుత్వ భూమలో నిర్మాణాలు జరుగుతున్నట్లు కనిపిస్తున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడం లేదనే ప్రశ్నలు స్థానికుల నుంచి వ్యక్రమవుతున్నాయి.

మూడేళ్ల చిన్నారి మృతితో వలస కూలీ కుటుంబంలో తీరని విషాదం

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎండీఆర్ ఫౌండేషన్
చిన్నారి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన మాద్రి పృథ్వీరాజ్
మానవత్వమే మా మార్గం.. సేవే మా లక్ష్యం ఎండీఆర్ ఫౌండేషన్



6

వృద్ధురాలిపై లైంగిక దాడి నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, నవంబర్ 24 : చలికాలం కావడంతో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో దుప్పట్లు పంచుతున్నారంటూ చెప్పడంతో అక్కడకు వచ్చిన వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ కామాంధుడు. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ పరిధిలోని ఓ బస్తీలో నివాసం ఉంటున్న వృద్ధురాలి(60)కి సమీపంలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద అర్ధరాత్రి వేళ దాతలు వచ్చి దుప్పట్లు పంచుతున్నారని తెలిసింది. దీంతో రెండ్రోజుల క్రితం అర్ధరాత్రి 12.30 గంటల ప్రాంతంలో క్యాన్సర్ ఆస్పత్రి ఫుట్‌పాత్ వద్దకు వచ్చిన వృద్ధురాలు దుప్పటి తీసుకుంది. ఇంటికి వెళ్లేందుకు ఉపక్రమిస్తున్న క్రమంలో మూత్ర విసర్జన కోసం సమీపంలో ఖాళీ స్థలంలోకి వెళ్లింది. అదే ప్రాంతంలో అవారాగా తిరుగుతూ మద్యం సేవించే పాత నేరస్తుడు భరత్ ఒంటరిగా ఉన్న వృద్ధురాలు నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లడాన్ని గమనించి అక్కడకు వెళ్లి ఆమెను చంపేస్తానంటూ బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించేందుకు యత్నించగా దాడి చేశాడు. ఈ క్రమంలో ఆమె ఫోన్ కిందపడిపోవడంతో దాన్ని తీసుకుని వెళ్లిపోయాడు.

ప్రభుత్వ భూమిపై అక్రమ నిర్మాణాలు..
రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం!



ఊరగుట్ట ప్రాంతంలోని ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు జరుగుతున్న విషయాన్ని స్థానికులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెబుతున్నారు.అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఫిర్యాదులు అందినప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్మాణాల వెనుక ఉన్న వాస్తవాలను గుర్తించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సర్వే చేస్తే అసలు విషయం బయటపడుతుందా?

సర్వే నంబర్ 115/1లోని స్థలం ప్రభుత్వ భూమా? దాని విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం అక్కడ జరుగుతున్న నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై రెవెన్యూ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.భూమి హద్దులను అధికారికంగా గుర్తించి,నిర్మాణాలపై విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ప్రభుత్వ భూమి అని నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించేది ఎప్పుడు?

ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో నిర్లక్ష్యం జరిగితే భవిష్యత్తులో భూములు అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సర్వే నంబర్ 115/1లోని స్థలాన్ని పరిశీలించి,అక్రమ నిర్మాణాల ఆరోపణలపై విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ భూమిని పరిరక్షించేందుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి

ముగ్గురిని మింగిన సెప్టిక్ ట్యాంక్

బాచుపల్లిలో దుర్ఘటన..మూడు కుటుంబాల్లో విషాదం

దుండిగల్, నవంబర్ 24 : కార్తికపౌర్ణమి వేళ మూడు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌కు వెళ్లిన ముగ్గురు యువకులు మృతి చెందిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. సీఐ దాలినాయుడు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యాలపేటకు చెందిన పవన్(24) కొంతకాలం క్రితం ఉపాధి కోసం వచ్చి 'హెచ్‌ఆర్ ఎన్విరో ప్రొటెక్షన్ సిస్టం' అనే కంపెనీలో ఎస్‌టీపీ సూపర్‌వైజర్‌గా ఉద్యోగంలో చేరాడు. నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లిలోని 'దినేశ్‌ఆరిక్ అపార్ట్‌మెంట్' వద్ద ఉంటూ అందులోని ఎస్‌టీపీ(సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్‌కు చెందిన సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకని పవన్ తన తోటి ఉద్యోగి(హెల్పర్) షణ్ముఖరావు 26),మియాపూర్‌లో ఉంటున్న సురేశ్(24)లను పిలిపించుకున్నాడు. ముందుగా షణ్ముఖరావు సెప్టిక్‌ట్యాంక్‌లోకి దిగాడు.ఊపిరి ఆడకపోడవంతో కేకలు వేయడంతో పవన్ దిగాడు.అతడి నుంచి కూడా ఎటువంటి స్పందన లేకపోవడంతో వెంటనే సురేశ్ సైతం సెప్టిక్ ట్యాంక్‌లోకి దిగాడు.కొద్ది సేపట్లోనే విషవాయువులు పీల్చి మృతి చెందారు. అక్కడే ఉన్న సురేశ్ బావమరిది బాలసాయి భయాందోళనకు గురై విషయాన్ని తమబంధువులకు చేరవేశాడు. ఎటువంటి స్పందన రాకపోవడంతో అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు,డీఆర్ఎఫ్ సిబ్బంది కలిసి మూడుగంటల పాటు శ్రమించి పవన్,షణ్ముఖరావు,సురేశ్ మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం గాంధీ వైద్యశాలకు తరలించారు. అయితే హెచ్‌ఆర్ ఎన్విరో ప్రొటెక్షన్ సిస్టం యాజమాన్యం యువకులను సెప్టిక్‌ట్యాంక్‌లోకి దించే సమయంలో



ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టక పోవడంతో పాటు కనీస భద్రతపరికరాలు కూడా అందుబాటులో ఉంచకపోవడం కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది.యువకులకు గ్లౌస్‌లుగాని,మాస్క్‌లు గాని ఏవి ఇవ్వలేదని మృతుల కుటుంబీకులు ఆరోపించారు.హెచ్‌ఆర్ ఎన్విరో ప్రొటెక్షన్ సిస్టం యజమాని రవిపై కేసు నమోదు చేశామని,అపార్ట్‌మెంట్ యాజమాన్యం నిర్లక్ష్యం ఉంటే వారిపైనా కేసులు నమోదు చేస్తామని బాచుపల్లి పోలీసులు తెలిపారు. తాము ఘటనా స్థలానికి చేరుకోకముందే శవాలను ఏ విధంగా గాంధీ వైద్యశాలకు తరలిస్తారని మృతుల కుటుంబీకులు దినేశ్ ఆరిక్ అపార్ట్‌మెంట్ వద్ద ఆందోళనకు దిగారు.అపార్ట్‌మెంట్ నిర్వాహకులతో పోలీసులు కుమ్మక్కై శవాలను ఇక్కడి నుండి తరలించారని ఆరోపించారు.తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదని భీష్మించడంతో ఉద్రిక్తతకు దారితీసింది. మృతుల కుటుంబాలకు తగిన పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలిసిన కుత్బుల్లాపూర్ ఏసీపీ బాలగంగిరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

వనస్థలిపురంలో భారీ చోరీ

వనస్థలిపురం, నవంబర్ 24 : వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో భారీ చోరీ జరిగింది. ఇంటికి వేసిన తాళం పగులగొట్టి చొరబడిన దుండగులు 30తులాల బంగారం, 4కిలోల వెండిని దొంగిలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్రాంత ఉద్యోగి మండలిక సాయి సత్యనారాయణ కుటుంబంతో కలిసి కమలానగర్‌లో నివసిస్తున్నాడు. తన భార్యకు ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో నగరంలోని ఏఐజీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆదివారం దవాఖానకు వెళ్లి సోమవారం ఇంటికి తిరిగి వచ్చాడు. తాళం పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువా తెరిచి ఉంది. ఇంట్లో నగలు, విలువైన వస్తువులు కనిపించలేదు. అందులో 4జతల గాజులు, ఒక నక్లెస్, పెద్ద గొలుసు, నల్లపూసల గొలుసు, పగడాల దండ, ముత్యాల గొలుసు, మంగళ సూత్రం గొలుసు, చెవి కమ్మలు, మాటీలు, 4 ఉంగరాలు ఉన్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చీరలకు నిప్పంటుకుని ఇద్దరు వృద్ధురాళ్లి మృతి



వెంగళరావునగర్,నవంబర్ 24 : కార్తిక మాసం, దీపావళి పండుగ సందర్భంగా ఇళ్లలో దీపాలు వెలిగిస్తుండగా జరిగిన ప్రమాదాలు రెండు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. ప్రమాదవశాత్తు చీరలకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడిన ఇద్దరు వృద్ధురాళ్లు చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎస్సార్ నగర్,మధురానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎస్సార్ నగర్ ఇన్‌స్పెక్టర్ దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..ఎస్సార్‌నగర్‌లోని జగన్నాథ్ రెసిడెన్సీలో నివాసముంటున్న చాపర్ల భానుమతి (62) ఆదివారం సాయంత్రం 7 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో కార్తిక మాసం దీపాలు వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుంది. మంటలుశరీరమంతా వ్యాపించాయి. మంటల తీవ్రతకు ఇంట్లోని సోఫా, ఏసీ యూనిట్లు సైతం కాలిపోయాయి. చుట్టుపకల వారు గుర్తించి ఆమెను ప్రైవేటు దవాఖానకు, అనంతరం మెరుగైన చికిత్స కోసం బంజారాహిల్స్ లోని మరో దవాఖానకు తరలించారు. చికిత్స పొం దుతూ భానుమతి మృతి చెందింది. ఆమె కుమార్తె కిన్నెర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరో ఘటనలో మధురానగర్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరినగర్‌కు చెందిన మడిశెట్టి సుగుణ (84) దీపావళి పండుగ రోజున రాత్రి 8 గంటల సమయంలో ఇంటి బాలనీలో నిలబడి పటాకుల వెలుగులను చూస్తున్నారు.



ఐదు సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి :షేర్ల అనిల్

క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి : ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని ప్రముఖ సంఘ సేవకులు షేర్ల అనిల్ పేర్కొన్నారు. పోలియో నిర్మూలన కారక్యమములో భాగంగా మంగళవారం నేరేడ్మెట్ బస్టాప్ లో పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజులో పోలియో రహిత సమాజం కోసం ప్రభుత్వము చక్కటి ఏర్పాట్లు చేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో శాలేము రాజు, సంగమేశ్వర, పాండు, మరియు అనిత, జోస్విన పాల్గొన్నారు.

మల్లూరు ఆలయానికి కానుకలు బహుకరణ

క్రైమ్ మిర్రర్,మంగపేట: మండలంలో ప్రసిద్ధ ప్రముఖ పుణ్య క్షేత్రం అయిన శ్రీ హేమాచల లక్ష్మీ నృసింహ స్వామి వారి ఆలయానికి మంగళవారం మంగపేట,మల్లూరు గ్రామనికి చెందిన భక్తులు కానుకలను బహుకరించారు.మంగపేట గ్రామనికి చెందిన పెన్మ్ మెత్స కృష్ణమూర్తి రాజు,రమాదేవి దంపతులు ఇత్తడి కానుకల హుండీలను మరియు మల్లూరు గ్రామానికి చెందిన గోళ్ళమూడి చంద్రశేఖరావు,హరిష దంపతులు రెండు ఇత్తడి దీవీటిలు(కాగడాల)ను ఆలయానికి బహుకరించారు.ధీవీటిల యొక్క విలువ రూ.10.000/- ఇత్తడి కానుకల హుండీల విలువ రూ,90.000 ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు.



సంక్షేమ హాస్టళ్లలో పాత పద్ధతిలోనే సరుకుల పంపిణీ చేపట్టాలి

కేంద్రీకృత క్యాంటీన్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. అర్జున్

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 24: సంక్షేమ హాస్టళ్లలో కేంద్రీకృత క్యాంటీన్ విధానం పేరుతో నాసిరకం సరుకులను అధిక ధరలకు పంపిణీ చేయడం ఏమిటని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. అర్జున్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని పలు సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆయన, విద్యార్థులకు అందుతున్న సరుకుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రీకృత క్యాంటీన్ విధానం పేరుతో పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆకలితో వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. ఏదైనా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు గతంలో ఉన్న విధానం కంటే మెరుగైన సేవలు అందించాలి తప్ప, మరింత అధ్వానంగా మార్చకూడదని హితవు పలికారు. కాలం చెల్లిన సరుకులతో తయారు చేసిన ఆహారాన్ని ముఖ్యమంత్రి తన మనవడికి వడ్డించగలరా అని ప్రశ్నించారు. సాధారణ మార్కెట్ ధరలతో పోలిస్తే 50 నుంచి 100 శాతం



వరకు అధిక ధరలకు సరుకులు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. నాసిరకం సరుకులను అధిక ధరలకు విద్యార్థులపై బలవంతంగా రుద్దడం అన్యాయమన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, ఆహార నాణ్యత విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. తక్షణమే కేంద్రీకృత క్యాంటీన్ విధానాన్ని రద్దు చేసి, గతంలో మాదిరిగానే సంక్షేమ హాస్టళ్లకు నాణ్యమైన సరుకులను పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. అర్జున్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆమనగల్లులో ఘనంగా 'గత్తెర' సినిమా ప్రారంభోత్సవం

ం క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

ం పాల్గొన్న ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

ం కడ్తాల్ వాసి కమ్లికర్ రజనీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం

క్రైమ్ మిర్రర్,ఆమనగల్లు: రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మున్సిపాలిటీ కేంద్రంలో రజనీష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న 'గత్తెర' నూతన తెలుగు చలనచిత్ర షూటింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన కమ్లికర్ రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి,జాతీయ ఓబీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరై క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ చిత్రంలో మిస్టర్ ఇండియా రాకేష్ హీరోగా నటిస్తుండగా, రూపావతి, ప్రవళిక హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రముఖ సీనియర్ నటులు బాబు మోహన్, తనికెళ్ల భరణి, జబర్దస్త్ రాజమౌళి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మరియు చిత్ర బృందం మాట్లాడుతూ.. 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే సందేశాత్మక కథాంశంతో, ప్రేక్షకులకు నచ్చేలా 'గత్తెర' సినిమాను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. స్థానిక ప్రాంతానికి చెందిన కమ్లికర్ రజనీకాంత్ దర్శకుడిగా పరిచయమవుతూ, ఆమనగల్లు పరిసర ప్రాంతాలను చిత్రీకరణకు ఎంచుకోవడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ చిత్రం ద్వారా తమ ప్రాంతానికి సినిమా



రంగంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, సర్పంచ్ రాయకంటి బిక్షపతి, ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి, కౌన్సిలర్ మహేష్, డీసీసీ ప్రధాన కార్యదర్శి చేగురి వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివలింగం, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి క్యామ రాజేష్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఫరీద్, యూత్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, వేణుగోపాల్, శ్రీను, శ్రీరాములు, విక్రమ్, కుమార్, చిత్ర యూనిట్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కోసం రైతుల పడిగాపులు

క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం: ఆరుగాలాలు కష్టపడి పండించిన వడ్లను అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారని తక్షణమే ప్రభుత్వం వడ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో చాప్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షం భయంతో ధాన్యం తడిసిపోతుందని ఆందోళన రైతులను వెంటాడుతుందని, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ప్రతి గింజను కొనుగోలు చేయడంతో పాటు సకాలంలో డబ్బులు చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తేమశాతం పేరుతో జాప్యం చేయకుండా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ధాన్యం డబ్బులను ఎలాంటి కొర్రీలు లేకుండా చెల్లించాలని కోరారు. వడ్ల మ్యాచర్, అదేవిధంగా క్వింటాలుకు ఒక కిలో రెండు కిలోలు కటింగ్ చేసే పద్ధతిని మానుకోవాలని రైతులకు న్యాయం చేసే దిశగా సంబంధిత అధికారులు చూడాలని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు తోకల రామిరెడ్డి, రైతు సంఘంమండల ప్రధాన కార్యదర్శి పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి పందుల యాదగిరి, పల్లె రాములు, ఈద మల్లయ్య, లక్ష్మణ్ నాయక్, పార్టీ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

75 ఏళ్ల వృద్ధుడి ఆస్తిపై కబ్జా యత్నం!

పూర్వీకుల స్థలం విషయంలో వివాదం.. అడ్డుకున్నందుకు దాడి?

ఖాళీ స్థలానికి ఇంటి నంబర్ కేటాయింపుపై వివాదం.. ఎస్పీ, డీపీవోకు ఫిర్యాదు



నల్లగొండ (క్రైమ్ మిర్రర్):పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిని కాపాడుకునే క్రమంలో, 75 ఏళ్ల వృద్ధుడు దాడికి గురయ్యారన్న ఆరోపణలు మర్రిగూడ మండలం, శివన్నగూడెం గ్రామంలో కలకలం రేపుతున్నాయి. తమ కుటుంబానికి చెందిన ఇంటి స్థలం, ఖాళీ ప్రదేశాన్ని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నించారని, దీనిని అడ్డుకున్నందుకు ఐదుగురు వ్యక్తులు తనపై దాడి చేశారని, గ్రామానికి చెందిన వడ్డె జంగయ్య ఆరోపించారు. నవంబర్ 19న జరిగిన ఈ ఘటనలో గాయపడిన ఆయన, నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీ, డీపీవోకు ఫిర్యాదు చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవించే జంగయ్యకు శివన్నగూడెంలో పూర్వీకుల నుంచి ఇంటి ఖాళీ స్థలం సంక్రమించాయని, వాటికి సంబంధించిన పాత పత్రాలు, బాండ్ పేపర్లు, సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ కుటుంబ స్వాధీనంలో ఉన్న స్థలాన్ని ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో వివాదం తలెత్తిందని తెలిపారు. ఈ క్రమంలో ఐదుగురు వ్యక్తులు తనపై దాడి చేసి గాయపరిచారని, స్థలాన్ని వదిలివేయాలని కోరినా బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. వయస్సును కూడా చూడకుండా తనపై దాడి చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆసుపత్రిలో చికిత్స.. వైద్య నివేదికలో గాయాలు

దాడిలో గాయపడిన వడ్డె జంగయ్య నవంబర్ 20న, నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆసుపత్రి క్యాజువాలిటీ విభాగంలో నమోదు చేసిన వైద్య నివేదికలో పొట్ట భాగం, నడుము, వెనుక భాగంలో మొద్దుబారిన వస్తువుతో గాయాలైనట్లు వైద్యులు నమోదు చేసినట్లు తెలుస్తుంది.!? ఈ వైద్య నివేదికను కూడా తన ఫిర్యాదులో భాగంగా బాధితుడు ప్రస్తావించారు. పూర్వీకుల స్థలానికి సంబంధించిన వివాదం, దాడి ఆరోపణల వరకు చేరడంతో, గ్రామంలో ఈ వ్యవహారం చర్చనీయాంశమైంది.

ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్.. బాండ్ పేపర్‌పై వివాదం.

ఈ స్థల వివాదంలో ఖాళీ ప్రదేశానికి ఇంటి నెంబర్ కేటాయించిన అంశం ప్రధానంగా తెరపైకి వచ్చింది. జంగయ్య కుటుంబానికి చెందిన ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ ఇచ్చి, ఆ నెంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకొని స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు ఉన్నాయి.! మరోవైపు కబ్జా యత్నం చేస్తున్న వజ్రమ్మ వద్ద ఉన్నట్లు చెబుతున్న, బాండ్ పేపర్ 2007 సంవత్సరానికి చెందినదని, ఆ బాండ్ పేపర్ పై 2006లో స్థలం కొనుగోలు చేసినట్లు రాసి ఉందని బాధిత వర్గం ఆరోపిస్తోంది.!? ఈ పత్రాల ఆధారంగానే స్థలంపై హక్కులు కోరుతున్నారన్న వివాదం నెలకొంది. స్థలం తమ కుటుంబ స్వాధీనంలోనే ఉందని, దానికి సంబంధించిన పాత ఆధారాలు తమ వద్ద ఉన్నాయని జంగయ్య పేర్కొంటున్నారు. ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయింపు, దాని ఆధారంగా జరిగినట్లు చెబుతున్న రిజిస్ట్రేషన్, బాండ్ పేపర్ల ప్రామాణికతపై సమగ్రంగా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. తనపై జరిగిన దాడి ఆరోపణలను కూడా విచారించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ, డీపీవోలకు పిర్యాదు చేశారు. పూర్వీకుల ఆస్తి వివాదంలో 75 ఏళ్ల వృద్ధుడు, న్యాయం కోసం అధికారులను ఆశ్రయించడం స్థానికంగా చర్చకు దారితీసింది. కాళీ స్థలం రిజిస్ట్రేషన్ పై, కాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించిన పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ రద్దీకి స్వస్తి చెప్పండి...



'సైబరాబాద్ మూవ్స్ 2026'తో సాఫ్ చలో...

సీపీ డా. ఎం. రమేష్...

క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ : ఒంటరిగా వాహనంలో ప్రయాణించే అలవాటుకు స్వస్తి పలికి, వాహనాలను పంచుకుని ప్రయాణించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. నవంబర్ 26, 27, 28 తేదీల్లో రాయదుర్గం టీ-హబ్‌లో జరగనున్న మూడు రోజుల 'సైబరాబాద్ మూవ్స్ 2026' కార్యక్రమంపై మంగళవారం కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. "హాయ్ బోలో, దిల్ ఖోలో, నో సోలో, సాఫ్ చలో!" అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు.ట్రాఫిక్ రద్దీకి పరిష్కారం ప్రతి పౌరుడి చేతిలోనే ఉందని సీపీ అన్నారు. ద్విచక్ర వాహనంపై వచ్చేవారు మరొకరిని వెంట తీసుకురావాలని, కారులో ఒక్కరే కాకుండా కనీసం మరొకరితో కలిసి రావాలని సూచించారు. పిల్లలను పాఠశాలలకు చేర్చేందుకు కార్లలో పదే పదే రాకపోకలు సాగించడం తగ్గించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. సైకిళ్లపై వచ్చేవారికి ప్రత్యేక మార్గం, సురక్షిత ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. జేఎన్‌టీయూ నుంచి ఐకియా ఐటీ కారిడార్ వైపు వచ్చేవారిలో దాదాపు 65% మంది ఒకే సమయంలో చేరుకోవడం వల్లే రద్దీ ఏర్పడుతోందని తెలిపారు. ఆ సమయంలో ఆర్టీసీ సహకారంతో అధిక సంఖ్యలో బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ ఉద్యమంలో సిఎంసీ , ఆర్టీసీ, ఎచ్ఎంఆర్ ఎల్ , ఎచ్ఎండీఏ భాగస్వాములుగా ఉన్నాయని వెల్లడించారు. ఈ మూడు రోజులు మెట్రో,ఎంఎంటీఎస్ , ఆర్టీసీ సేవలను వినియోగించాలని అధికారులు సూచించారు.





శ్రీ సాయి రాం నగర్ సమస్యల పై మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్‌కు కాలనీ వాసుల వినతి...

క్రైమ్ మిర్రర్ మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి రాం నగర్ కాలనీ వాసులు కాలనీలోని పలు సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, త్వరలోనే కాలనీలో స్వయంగా పర్యటించి సమస్యలను పరిశీలించి, విడతల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పీ ఏ సీ చైర్మన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక చొరవతో డివిజన్‌లో అత్యవసరం ఉన్న చోట, నిత్యం సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ప్రథమ ప్రాధాన్యతగా పనులు పూర్తి చేస్తామని తెలిపారు.శ్రీ సాయి రాం నగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడబోమని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేస్తామని పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు మహమ్మద్ షా, సత్యనారాయణ, మల్లికార్జున్ రెడ్డి, రవీందర్, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శామీర్, నరేందర్ రెడ్డి, రామకృష్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి సహకారంతో 39 మందికి 19.50 లక్షల చెక్కుల పంపిణీ

మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆర్థిక భరోసాగా నిలుస్తోందని, మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్ అన్నారు. అనారోగ్య సమస్యలతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న, పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. మంగళవారం మర్రిగూడ మండల కేంద్రంలోని, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో, మంజూరైన 19 లక్షల 50 వేల విలువైన చెక్కులను మండలంలోని, 39 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మర్రిగూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రామదాసు శ్రీనివాస్‌తో పాటు, మాజీ జడ్పీటీసీ మేతరీ యాదయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండలంలోని గ్రామశాఖ అధ్యక్షులు, పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. వీరితో పాటు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.



శివాలయంలో మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ ప్రత్యేక పూజలు



క్రైమ్ మిర్రర్,ఆమనగల్లు: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలోని శివాలయంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్. పత్యా నాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.
మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయన, స్వామివారికి భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకం నారాయణపురం గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోండి

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా దరఖాస్తు చేసుకున్న వారికి జీవిత బీమా రిసిప్ట్ ను అందజేస్తున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

క్రైమ్ మిర్రర్, సంస్థాన్ నారాయణపురం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రేషన్ కార్డు ఉన్నటువంటి ప్రతి కుటుంబానికి కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణించినప్పుడు కుటుంబానికి ఆర్థిక సాయం అందించడం. కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడం కోసం 5,00,000 ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి అన్నారు. అనంతరం బీమా దరఖాస్తు చేసుకున్న వారికి రిసిప్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పల్లె మల్లారెడ్డి, నారాయణపురం మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహ, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఉప్పల రాజయ్య, గ్రామ శాఖ సహాయ కార్యదర్శి రేవనపల్లి గోపాల్, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు,పల్లె ఆనంద్ గౌడ్, కొంశెట్టి రవి,వడ్డేపల్లి శివప్రసాద్ బానోతు కిరణ్ నాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



26న మద్దిమడుగులో సంత్ సేవాలాల్ విగ్రహ భూమిపూజ

o గిరిజన లంబాడీ సోదరులు స్వచ్ఛందంగా తరలిరావాలి:మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్



క్రైమ్ మిర్రర్,ఆమనగల్లు: పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిమడుగు ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలోని సుమారు 20 ఎకరాల విశాల స్థలంలో బంజారాల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు ఈ నెల 26వ తేదీన భూమిపూజ నిర్వహించనున్నట్లు ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ఎన్. పత్యా నాయక్ తెలిపారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి ప్రతి గిరిజన లంబాడీ బిడ్డ స్వచ్ఛందంగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.మంగళవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో పత్యా నాయక్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గిరిజనులు అత్యధికంగా పూజించే మద్దిమడుగు క్షేత్రంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహ భూమిపూజ జరగడం ఒక గొప్ప పరిణామమని కొనియాడారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజనులు నివసించే తండాలు, గూడేలకు దూరంగా, కేవలం ఆర్భాటం కోసం ఎవరికీ అందుబాటులో లేని చోట విగ్రహాలు ఏర్పాటు చేశారని విమర్శించారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి గిరిజన సోదరులకు నిత్యం అందుబాటులో ఉండేలా నల్లమల నడిబొడ్డున విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం పట్ల గిరిజనులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. గిరిజనులకు మేలు జరగాలన్నా, అభివృద్ధి సాధ్యం కావాలన్నా అది కేవలం కాంగ్రెస్ పార్టీతోనే అవుతుందన్నారు. నేడు గిరిజనులు ఉన్నత స్థాయికి ఎదిగారంటే అందుకు నాడు దివంగత ప్రధాని ఇందిరా గాంధీ కల్పించిన రిజర్వేషన్లే ప్రధాన కారణమని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో వెల్దండ మండలం సింగిల్ విండో వైస్ చైర్మన్ శంకర్ నాయక్, గిరిజన నాయకులు బిచ్యా నాయక్, మాజీ ఎంపీపీ అనిత విజయ్ నాయక్, సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్ నాయక్, ఉప సర్పంచ్ సురేష్ నాయక్, సింగిల్ విండో డైరెక్టర్లు ఆనంద్ కుమార్, కిషన్ నాయక్, ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ కృష్ణ నాయక్, మాజీ సర్పంచ్ పంతు నాయక్, రాగ్య నాయక్, మల్లేష్ నాయక్, శ్రీను నాయక్, శ్రీధర్ నాయక్ తదితర గిరిజన నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మీనంపల్లి కిషన్ రావు

77 ఏళ్ల భారత రాజ్యాంగం -- బహుజనుల స్థితిగతులపై సామాజిక సదస్సు నవంబర్ 26న దౌల్తాబాద్‌లో నిర్వహణ..

యువత, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, సామాజికవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలి

సామాజిక ఉద్యమ నాయకులు మీనంపల్లి కిషన్ రావు పిలుపు



హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 24: భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి మౌలిక విలువలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని సామాజిక ఉద్యమ నాయకులు మీనంపల్లి కిషన్ రావు అన్నారు. రాజ్యాంగ ప్రాధాన్యతను నేటి యువతకు తెలియజేయడంతో పాటు బహుజన సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి సమస్యలపై సమగ్ర చర్చ జరగాలనే లక్ష్యంతో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న సామాజిక సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌లో దళిత జర్నలిస్టుల ఫోరమ్ హత్నూర మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు “77 ఏళ్ల భారత రాజ్యాంగం -- బహుజనుల స్థితిగతులు” అనే అంశంపై ప్రత్యేక సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి దశాబ్దాలు గడిచిన నేపథ్యంలో రాజ్యాంగం అందించిన హక్కులు, సామాజిక మార్పులు, బహుజన వర్గాల అభివృద్ధి, ప్రస్తుత పరిస్థితులు, భవిష్యత్తులో ఎదుర్కోవాల్సిన సవాళ్లపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా వ్యవస్థీకరించిన ఆల్ ఇండియా సమతా సైనిక్ దళ్‌లో జాతీయ స్థాయిలో మూడు పర్యాయాలు చైర్మన్‌గా సేవలందించిన విశ్రాంత ఉపాధ్యాయులు, ప్రముఖ అంబేద్కర్‌వాది ఎస్. చంద్రయ్య హాజరుకానున్నారని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా సామాజిక హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పారం ప్రకాష్, హత్నూర మండల తహసీల్దార్ ఫర్వీన్ షేక్, జిన్నారం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి పాల్గొననున్నారని వెల్లడించారు. వీరితో పాటు పలువురు సామాజిక బహుజన మేధావులు, ఉద్యమకారులు సదస్సులో పాల్గొని రాజ్యాంగం ప్రాధాన్యత, సామాజిక న్యాయం, బహుజనుల హక్కులు, సమాన అవకాశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించనున్నారు. భారత రాజ్యాంగం కేవలం ఒక పాలనా వ్యవస్థకు సంబంధించిన గ్రంథం మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, గౌరవం, స్వేచ్ఛ, భద్రత కల్పించే మహోన్నత మార్గదర్శకమని కిషన్ రావు పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధితో పాటు అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాలకు సామాజిక భద్రత, న్యాయం, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే రాజ్యాంగ ప్రధాన లక్ష్యమని వివరించారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించి, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయడమే రాజ్యాంగ స్ఫూర్తి అని తెలిపారు. అయితే ప్రస్తుత మారుతున్న సామాజిక పరిస్థితుల్లో రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువల పట్ల యువతలో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో అభద్రతా భావాలు, అసమానతలు, వివక్ష పెరగకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల గురించి తెలుసుకోవడంతో పాటు వాటిని ఆచరణలో కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, విధులు, సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా హక్కు, ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేవలం సమావేశాలు, ప్రసంగాలకే పరిమితం కాకుండా రాజ్యాంగ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సామాజిక మార్పు కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, మహిళలు, ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయవాదులు, సామాజిక ఉద్యమకారులు, బహుజన మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని మీనంపల్లి కిషన్ రావు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్యంగా ముందుకు సాగుతూ భావితరాలకు సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలతో కూడిన సమాజాన్ని అందించడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు.

మూడేళ్ల చిన్నారి మృతితో వలస కూలీ కుటుంబంలో తీరని విషాదం

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన ఎండీఆర్ ఫౌండేషన్

చిన్నారి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించిన మాద్రి పృథ్వీరాజ్

మానవత్వమే మా మార్గం.. సేవే మా లక్ష్యం ఎండీఆర్ ఫౌండేషన్





పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 24: జార్ఖండ్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం పటాన్‌చెరు సమీపంలోని ఓ కంపెనీ వద్దకు వలస వచ్చిన నిరుపేద కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కుటుంబ పోషణ కోసం తల్లిదండ్రులిద్దరూ కూలీ పనులకు వెళ్తుండగా, వారి మూడేళ్ల చిన్నారి నివాస గుడిసె సమీపంలోని నీటి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయాడు. కన్నబిడ్డను కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలచివేశాయి.దరెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి చిన్నారి మరణం తీరని లోటుగా మారింది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్నారి అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబం ఎండీఆర్ ఫౌండేషన్‌ను సంప్రదించింది. విషయం తెలుసుకున్న ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ మానవతా దృక్పథంతో స్పందించి ఆర్థిక సహాయం అందించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారి అంత్యక్రియలను గౌరవప్రదంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ పేదరికం కారణంగా తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లడం అనివార్యమైనప్పటికీ, చిన్నారుల భద్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గుడిసెలు, నిర్మాణ ప్రాంతాలు, నీటి గుంతలు, సంపులు, బోర్లు, డ్రైనేజీలు ఉన్న పరిసరాల్లో పిల్లలను ఒంటరిగా వదిలేయకూడదన్నారు. ప్రమాదకరమైన నీటి గుంతలను పూడ్చడం, వాటి చుట్టూ భద్రతా కంచెలు ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం ఒక కుటుంబానికి జీవితాంతం తీరని గాయాన్ని మిగిల్చే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు మానవతా సహాయం అందించడం ఎండీఆర్ ఫౌండేషన్ లక్ష్యమని తెలిపారు. కన్నబిడ్డను కోల్పోయిన తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఆ కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.



సీఎం సహాయనిధి చెక్కులు అందజేత.

కేశంపేట,(క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తన సిఫారసు తో 2,20,000 విలువలగల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంజూరు చేయించారు.ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులు సరళమ్మ అల్వాల్,టి.చెన్న కేశవులు దత్తాయిపల్లి,ఆకె సరిత ఇప్పలపల్లి, కుమ్మరి ఆంజనేయులు బైర్ఖాన్‌పల్లి, గంజి లక్ష్మయ్య తొమ్మిదిరేకుల, జర్పుల రవి తొమ్మిదిరేకుల, దిద్దెల అంజమ్మ లేమామిడి,నిర్ధవెల్లి పరుశురాములు కొత్తపేటకు మంజూరైన చెక్కులను మంగళవారం మండల ప్రజాప్రతినిధులు,బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కేశంపేట సర్పంచ్ బొజ్జం సంతోష శ్రీశైలం యాదవ్, సుందరాపురం డిప్యూటీ సర్పంచ్ యారం రాంరెడ్డి,నాయకులు, తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి,భూపాల్ రెడ్డి,శివ యాదవ్,శేఖర్ పంతులు, శ్రీశైలం గౌడ్,ఆంజనేయులు యాదవ్, బాలరాజ్ గౌడ్,కృష్ణయ్య,శేఖర్,రాంరెడ్డి, మురళి, యాదయ్య,జగన్ రెడ్డి,లక్ష్మయ్య ,జగత్ రెడ్డి, నాగరాజు, చింటూ,శశి,కిషోర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై కాంగ్రెస్ సర్కారును నిలదీస్తాం: బొల్లం మల్లయ్య యాదవ్

మొదటి ప్రాధాన్యత ఓటుతో రాకేష్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి..మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

కోదాడ నవంబర్ 24 (క్రైమ్ మిర్రర్) కోదాడ: వరంగల్--ఖమ్మం--నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌తో కలిసి కోదాడ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పట్టభద్రులు, నిరుద్యోగ యువత, విద్యావంతులు, విశ్రాంత ఉద్యోగులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొని పట్టభద్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు రెండు లక్షల ఉద్యోగాల కల్పన, ఉద్యోగ నియామకాల్లో జాప్యం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు వంటి అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.అనంతరం పట్టణంలోని గ్రంథాలయం, సక్సెస్ స్టడీ సెంటర్లను సందర్శించి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, చదువుకు అవసరమైన సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొల్లం మల్లయ్య యాదవ్, రాకేష్ రెడ్డి కలిసి యువతకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. నిరుద్యోగుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించి, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతామని రాకేష్ రెడ్డి తెలిపారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోదాడ శాఖ ప్రతినిధులను కలిసి పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పీఆర్సీ అమలు, డీఏ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, వైద్య సదుపాయాలు, పాత పెన్షన్ విధానం వంటి సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులుగా జీవితకాలం సేవలందించిన విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై పూర్తి అవగాహన కలిగి, వాటి పరిష్కారం కోసం చట్టసభల్లో గళం వినిపించే సత్తా ఉన్న నాయకుడు రాకేష్ రెడ్డి అని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టభద్రులు, విద్యావంతులకు విజ్ఞప్తి చేశారు.



పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ గీత రమేష్

చిట్యాల క్రైమ్ మిర్రర్: చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఉన్న గురుద్వార్‌లో శ్రీ గురునానక్ దేవ్ జీ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీత రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని సిక్కు సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురునానక్ దేవ్ జీ బోధించిన ప్రేమ, శాంతి, సమానత్వం, సేవాభావం, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, 2వ వార్డు మాజీ కౌన్సిలర్ కోనేటి కృష్ణ, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జయరాపు శివ, దాసరి నర్సింహా, నూనె ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.





భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

క్రైమ్ మిర్రర్,మంగపేట: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం మంగపేటలోని ఉమా చంద్రశేఖర స్వామి ఆలయం,మల్లూరు లోని శ్రీ శంభు లింగేశ్వర స్వామి ఆలయం, రాజుపేటలోని కొండలింగేశ్వర స్వామి ఆలయం, వాగోడ్డుగుడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీ నరసాపురంలో నాగులమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.శివాలయాల్లో శివునికి రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించగా, మహిళలు పుట్టల వద్ద దీపాలు వెలిగించి పాలు, గుడ్లు నైవేద్యంగా సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజుగా భావించే కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు ఉపవాసాలు పాటిస్తూ, నదులు, చెరువుల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. హరహర మహాదేవ, ఓం నమఃశివాయ నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాలకు వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. పలు ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్తీక పౌర్ణమి వేడుకలతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

వివాహ వేడుకలో పాల్గొని వధువును ఆశీర్వదించిన సర్పంచ్

క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ) : వెల్దండ మండల కేంద్రానికి చెందిన పిల్లి ఎల్లయ్య ముదిరాజ్ కుమార్తె వివాహ వేడుకల్లో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, మాజీ ఆర్య వైశ్య జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన వధువును ఆశీర్వదించి, దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బయ్య మల్లయ్య, మట్ట మదన్ గౌడ్, పిల్లి శేఖర్, మావిళ్ల గణేష్, సదమోని బాలకృష్ణ, పిల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సెలవు రోజున నిబంధనలను ఉల్లంఘించి పాఠశాల నిర్వహిస్తున్న నారాయణ యాజమాన్యం! అధికారుల నిర్లక్ష్యంపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం



- నిబంధనలను బేఖాతరు చేస్తూ పాఠశాల నిర్వహిస్తున్న నారాయణ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

- ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎంఈఓ.

- నారాయణ పాఠశాలను వెంటనే మూసివేయాలని కోరుతున్న డీఈఓ.

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళన.

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో: ప్రభుత్వం ప్రకటించిన సెలవు రోజున విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘిస్తూ పాఠశాలను నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థల యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ డిమాండ్ చేసింది. విద్యాశాఖ నిబంధనలను, ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ విద్యార్థులను పాఠశాలకు రప్పించి తరగతులు నిర్వహించడం నారాయణ యాజమాన్యం నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించింది. ఈ ఘటనపై సంబంధిత విద్యాశాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ, అధికారులు బాధ్యతాయుతంగా స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యపై వివరణ కోరేందుకు ప్రయత్నించినా ఎంఈఓ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. మరోవైపు పాఠశాలను మూసివేయాలని డీఈఓ కోరుతున్నప్పటికీ, యాజమాన్యం మాత్రం తన ఇష్టానుసారంగా పాఠశాలను కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే విద్యాశాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం సరికాదన్నారు. ప్రభుత్వ సెలవు దినాల్లో కూడా విద్యార్థులను పాఠశాలలకు రప్పించడం ద్వారా వారి స్వేచ్ఛను, విశ్రాంతిని హరించే హక్కు ఏ యాజమాన్యానికీ లేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నారాయణ పాఠశాల ఎదుట ఆందోళన నిర్వహించి యాజమాన్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. తక్షణమే పాఠశాల నిర్వహణను నిలిపివేయాలని, సంబంధిత నిబంధనల ప్రకారం బాధ్యులైన యాజమాన్య ప్రతినిధులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యను వ్యాపారంగా మార్చి విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు ఖమ్మం డివిజన అధ్యక్షులు త్రినాథ్ జిల్లా కమిటీ సభ్యులు సుశాంత్ నాయకులు శ్యామ్, మనోహర్, తేజ,ప్రభుదాస్, వినోద్, మహేష్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

రామప్ప దేవాలయంను సందర్శించిన జర్మనీ దేశస్తులు

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 24:: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం జర్మనీ దేశానికి చెందిన సుసాన్ సియో, మెల్చియర్స్ కాథరినా లు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.





వ్యవసాయ బోరు మోటార్ వైరు చోరీ ఇద్దరు నిందితుల అరెస్ట్

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, నవంబర్ 24: వ్యవసాయ బోరు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైరు చోరీ కేసును పుల్కల్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి చోరీకి ఉపయోగించిన కట్టింగ్ ప్లేయర్, మిగిలిన విద్యుత్ వైరు, రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 18న చక్రియాల్ గ్రామానికి చెందిన రోళ్ళపాటి బేతాల్ తన వ్యవసాయ పొలం వద్ద స్టార్టర్ నుంచి బోరు మోటార్‌కు వెళ్లే విద్యుత్ వైరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పుల్కల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం అనుమానితులను విచారించగా శివ్వంపేట గ్రామానికి చెందిన కుమ్మరి శివకుమార్ (23), దూదేకుల సమీర్ (19) కలిసి ఈ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. నిందితులు చక్రియాల్ గ్రామంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి, ఒకరు రోడ్డు వద్ద కాపలాగా ఉండగా మరొకరు కట్టింగ్ ప్లేయర్‌తో బోరు మోటార్ విద్యుత్ వైరు కత్తిరించి చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. అనంతరం చోరీ చేసిన వైరును ఇద్దరూ సమానంగా పంచుకొని జల్సాలకు ఖర్చు చేశారు. వీరిలో ఒకరు తన వాటాకు వచ్చిన వైరును పాత సామాన్ల వ్యాపారికి విక్రయించగా రూ.16 వేల నగదు వచ్చింది. అందులో ఖర్చు చేసిన రూ.వెయ్యి మినహా మిగిలిన రూ.15 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే చోరీకి ఉపయోగించిన కట్టింగ్ ప్లేయర్, మిగిలిన వైరు కూడా స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో నిందితులైన కుమ్మరి శివకుమార్, దూదేకుల సమీర్‌లను అరెస్ట్ చేసి గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచారు. వ్యవసాయ పొలాలు, బోరు మోటార్లు, విద్యుత్ పరికరాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పుల్కల్ పోలీసులు సూచించారు.



కల్వకుర్తి యువతకు గోల్డెన్ ఛాన్స్..

ఇక స్థానికంగానే అంతర్జాతీయ స్థాయి నైపుణ్య శిక్షణ

సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీతో నిరుద్యోగ యువతకు కొత్త దారి.. డిసెంబర్ 1న ప్రారంభం



క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 1 నుంచి కల్వకుర్తి పట్టణంలోని తాసిల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత కృష్ణవేణి జూనియర్ కళాశాల భవనంలో ఈ శిక్షణ కేంద్రం ప్రారంభం కానుందని మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో 2022లో 'నిరుద్యోగ వాణి -- ఐక్యత భరోసా' కార్యక్రమంతో తమ ప్రస్థానం ప్రారంభమైందని ఆయన వివరించారు. ఆమనగల్, కల్వకుర్తి, కడ్తాల్ ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించి నిరుద్యోగ యువత అభిప్రాయాలు, అవసరాలు, సలహాలు, సూచనలు సేకరించినట్లు తెలిపారు. యువత విజ్ఞప్తి మేరకు 2023 జనవరి 29న ఆమనగల్‌లో ఉచిత ఎస్సై, కానిస్టేబుల్ కోచింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 60 మందికి శిక్షణ అందించగా, వారిలో 22 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. అదే ఏడాది ఏప్రిల్‌లో నియోజకవర్గవ్యాప్తంగా యువత నైపుణ్యాలను గుర్తించే కార్యక్రమం చేపట్టి, మే 6న జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ప్రత్యేక మహిళా జాబ్ మేళాలు సైతం నిర్వహించినట్లు వివరించారు. 2026 ఏప్రిల్‌లో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆరు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి 300 మందికి పైగా యువతకు శిక్షణతో పాటు ఉచిత స్టడీ మెటీరియల్ అందించినట్లు తెలిపారు. కల్వకుర్తిలో రెండో బ్యాచ్ ద్వారా మరో 80 మందికి శిక్షణ కల్పించినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో కేవలం విద్యార్హతలు ఉంటే సరిపోవని, కంప్యూటర్ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు ఎంతో అవసరమని గుర్తించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా కల్వకుర్తిలో టాస్క్ స్కిల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించినప్పటికీ కొన్ని అనివార్య కారణాలతో అది ముందుకు సాగలేదని, యువతకు మరింత ఆలస్యం కాకూడదనే ఉద్దేశంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సొంతంగా సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కేంద్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), పైథాన్, జావా ఫుల్ స్టాక్, డిజిటల్ మార్కెటింగ్, అడ్వాన్స్‌డ్ ఎక్సెల్, జీఎస్టీ, ట్యాలీ తదితర ఆధునిక కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. శిక్షణలో భాగంగా అభ్యర్థుల నైపుణ్యాలను ముందుగా విశ్లేషించి, కోర్సుల్లో నమోదు చేయడంతో పాటు సైద్ధాంతిక బోధన, కంప్యూటర్ ల్యాబ్‌లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తామని చెప్పారు. రెజ్యూమ్ తయారీ, ఇంటర్వ్యూ సాధన, ఉద్యోగ అవకాశాలకు అవసరమైన మార్గదర్శకత్వం కూడా కల్పించనున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత యువత ఖరీదైన శిక్షణ కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ఆధునిక సాంకేతిక విద్యను ఉచితంగా అభ్యసించే అవకాశం కల్పించడమే ఈ స్కిల్ ఫ్యాక్టరీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. "యువతకు ఉద్యోగం రావాలంటే ముందుగా నైపుణ్యం రావాలి. నిరుద్యోగ యువతకు కేవలం ఉద్యోగ సమాచారం అందించడం మాత్రమే కాకుండా, ఉద్యోగం పొందేందుకు అవసరమైన నైపుణ్యాలను కూడా అందించాలి. 2022లో యువత అభిప్రాయాలు తెలుసుకోవడంతో ప్రారంభమైన మా ప్రయాణం నేడు సుంకిరెడ్డి స్కిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు వరకు చేరుకుంది. మన ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐక్యత ఫౌండేషన్ ద్వారా మా ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతాయి" అని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శేఖర్, గణేష్, శ్రీపతి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం.. లారీ, బైక్ ఢీకొని 14 ఏళ్ల బాలుడు మృతి

చిన్న వయసులోనే నిండు ప్రాణం బలి.. పాత గుడిబండలో విషాదఛాయలు

కోదాడ నవంబర్ 24 క్రైమ్ మిర్రర్ : కోదాడ: అడ్లూరు సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఓ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. లారీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో పాత గుడిబండ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలుడు షేక్ నాగుల్ మీరా మృతి చెందాడు. చిన్న వయసులోనే బాలుడు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో పాత గుడిబండ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.పాత గుడిబండ గ్రామానికి చెందిన షేక్ లతీఫ్ కుటుంబానికి చెందిన షేక్ నాగుల్ మీరా గుడిబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. చదువుకుంటూ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల మధ్య సంతోషంగా గడుపుతున్న బాలుడు అనుకోని రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.మంగళవారం పాఠశాలకు సెలవు కావడంతో నాగుల్ మీరా తొగర్రాయికి వెళ్లి తిరిగి వస్తుండగా అడ్లూరు సమీపంలో లారీ, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడు మృతి చెందాడు. అప్పటివరకు తమ మధ్య ఆనందంగా తిరిగిన బాలుడు ఇక లేడన్న వార్త తెలిసి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.చేతికొచ్చిన వయసులోనే బాలుడు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు, బంధువుల ఆవేదన వర్ణనాతీతంగా మారింది. గ్రామానికి చెందిన చిన్నారి అకాల మరణవార్త తెలుసుకున్న గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రామప్ప దేవాలయంను సందర్శించిన ట్రైయినీ డీఎస్పీలు

వెంకటాపూర్ (రామప్ప), క్రైమ్ మిర్రర్, నవంబర్ 24: మండలం లోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని మంగళవారం ట్రైయినీ డీఎస్పీ లు మహేష్ గౌడ్, సాయి విశ్వనాథ్ లు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉఉమాశంకర్ వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారికి టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ ఆలయ చరిత్ర, శిల్పకళ వైభవం, కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ అని కోనియాడారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి పర్యాటక శాఖ బోట్లలో బోటింగ్ చేశారు. వారి వెంట ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.

